## దేశ ప్రజల చూపు ప్రాంతీయ శక్తులవైపే

### పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కథ ఖతం: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ నయవంచనకు నిలువెత్తు రూపమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు విమర్శించారు. ఇండియా కూటమి విచ్ఛిన్నంపై ఆయన గురువారం ఎక్స్ వేదికగా స్పందించారు. మిత్రపక్షాలనే ఒప్పించలేని కాంగ్రెస్.. దేశ ప్రజలను ఏం మెప్పిస్తుందని ప్రశ్నించారు. 'మోసం కాంగ్రెస్ నైజం. నయవంచనకు నిలువెత్తు రూపం. అందుకే ఆదిలోనే ఇండియా కూటమికి బీటలు. అందుకే కాంగ్రెస్‌ను వీడి టీఎంసీ, ఆమ్ ఆద్మీ పార్టీల ఒంటరిపోరు. మిత్రపక్షాలను ఒప్పించలేని కాంగ్రెస్.. దేశ ప్రజలను ఏం మెప్పిస్తుంది? మోదీని, బీజేపీని ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్‌కు లేదు. ఇండియా కూటమికి అంతకన్నా లేదు. మిత్రపక్షాలు దూరం కావడమే ఇందుకు నిదర్శనం. ఇక దేశ ప్రజల చూపు ప్రాంతీయ శక్తుల వైపే. తెలంగాణలో కేసీఆర్ అయినా, బెంగాల్‌లో మమతా దీదీ, పంజాబ్, ఢిల్లీలో కేజ్రీవాల్ అయినా.. పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటేది రాష్ట్రాల్లో బలమైన పార్టీలే. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కథ ఖతం. కేంద్రంలో ఏర్పడే ప్రభుత్వంలో ప్రాంతీయ శక్తుల పాత్రే కీలకం' అని ట్వీట్ చేశారు.

## నేడు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం

### బడ్జెట్ సమావేశాలపై దిశానిర్దేశం చేయనున్న కేసీఆర్

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీ పార్లమెంటరీ సభ్యుల సమావేశం శుక్రవారం జరగనున్నది. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ఆధ్వర్యంలో గజ్వేల్ నియోజకవర్గం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో ఈ సమావేశం జరగనున్నది. దీనికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు హాజరు కానున్నారు. ఈ నెల 31 నుంచి ప్రారంభంకానున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఎంపీలకు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు.

## పంచాయతీ ఎన్నికలు ఇప్పట్లో ఉండవు

### పంచాయతీరాజ్, శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క

వేములవాడ, జనవరి 25: రాష్ట్రంలో గ్రామపంచాయతీల పాలకవర్గాల గడువు ఈ నెలతో ముగియనుండగా తాము ఇప్పట్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించలేమని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి గురువారం ఆమె దర్శించుకున్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. రెండు, మూడు రోజుల్లో సమావేశం నిర్వహించి పంచాయతీ ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అధికారంలోకి రాగానే పంచాయతీల బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని మీడియా ప్రతినిధులు గుర్తుచేయగా, గత ప్రభుత్వం 16 నెలలుగా పంచాయతీలకు రూ.1,200 కోట్లు చెల్లించలేదని చెప్పారు. ఉద్యోగులకు ప్రతి నెలా నాలుగో తేదీలోగా జీతాలు చెల్లించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.



#### ఆచార వ్యవహారాలను ధ్వంసం చేస్తారా?

దేశంలో కొందరు పలానా దేవుళ్లనే కొలువాలని స్థానిక ఆచార వ్యవహారాలను, సంప్రదాయాలను ధ్వంసం చేసే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు. రాజన్న తమ ఇలవేల్పు అని, కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్నట్టు తెలిపారు. ఆదివాసి కుటుంబంగా సమ్మక్క సారలమ్మ జాతరకు ముందు రాజన్నను దర్శించుకునే ఆనవాయితీ ఉన్నదని చెప్పారు.

## అర్చకులకు గౌరవ వేతనాలు విడుదల

హైదరాబాద్, జనవరి 25(నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని 2,656 మంది ధూప దీప నైవేద్యం (డీడీఎన్) అర్చకులకు ఈ ఏడాది జనవరి నుంచి మార్చి వరకు మూడు మాసాల గౌరవ వేతనాల కింద రూ. 46.81కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీచేసింది. 2023-24వార్షిక బడ్జెట్ నుంచి నిధులు విడుదల చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# దమ్ముంటే లోకల్ ఎన్నికలు పెట్టండి

**ఇన్‌చార్జిలతో గ్రామాల పాలన నడపడమెందుకు? • ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికలకు వెళ్లాలి • ప్రపంచ వేదికపై సీఎం రేవంత్ పచ్చి అబద్ధాలు: కేటీఆర్**

- నేను దావోస్ పర్యటనకు వెళ్తే డబ్బు దాచుకొనేందుకన్నారుగా!
- రేవంత్ ఎందుకు వెళ్లారో చెప్పాలి
- సీఎం పర్యటనపై భట్టే విమర్శలు
- రైతుబంధు డబ్బులే ఇంకా వేయలే
- రెండు నెలల్లోనే కాంగ్రెస్ సర్కారుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- సీఎం క్యాంపు ఆఫీస్ ఉండగా కొత్త భవనం ఎందుకు?
- నేడు మా పార్లమెంటరీ పార్టీ భేటీ
- రేపు బీఆర్ఎస్ మైనార్టీ సెల్ భేటీ
- త్వరలోనే సోషల్ మీడియా వారియర్స్‌తో సమావేశమవుతాం
- మీడియా చిట్‌చాట్‌లో కేటీఆర్

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వానికి ధైర్యముంటే వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు సవాల్ విసిరారు. ఇన్‌చార్జిలతో గ్రామాల్లో పాలన నడిపించకుండా వెంటనే ఎన్నికలు నిర్వహించి కొత్త ప్రజాప్రతినిధుల చేతుల్లో పాలన పెట్టాలని సూచించారు. ప్రస్తుత సర్పంచుల హయాంలో నిర్మించిన భవనాలు, ఇతర మౌలిక వసతులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా కేటీఆర్ పలు అంశాలపై మాట్లాడారు. ప్రారంభమే కాని రైతు భరోసా కార్యక్రమం ద్వారా రైతులకు డబ్బులు ఇస్తున్నట్టు ప్రభుత్వం చెప్పడం ప్రజలను మోసం చేయడమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు విమర్శించారు. రైతు భరోసా ప్రారంభించామని పచ్చి అబద్ధాలు చెప్పినందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దావోస్‌లో ప్రపంచ వేదికపై సీఎం నోటికొచ్చిన అబద్ధాలన్నీ చెప్పారని మండిపడ్డారు. అంతర్జాతీయ వేదికలపై సీఎం అబద్ధాలు చెప్తుంటే.. రాష్ట్రంలో రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతామని మంత్రులు అంటున్నారని ధ్వజమెత్తారు.

### నెలన్నరలో సాధించింది.. ఢిల్లీకి వెళ్లిరావటమే

ఇప్పటికే ఉన్న రైతుబంధు ఇవ్వని రేవంత్ రెడ్డి.. లేని రైతు భరోసా గురించి మాట్లాడటం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని కేటీఆర్ విమర్శించారు. రేవంత్‌రెడ్డి 50 రోజుల పరిపాలనలో సాధించింది ఢిల్లీ పర్యటనలు చేయడం మాత్రమేనని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తెలంగాణ పరిపాలన ఢిల్లీ నుంచి జరుగుతుందని తాము ముందుగానే తాము చెప్పామని.. ప్రస్తుతం అదే జరుగుతున్నదని అన్నారు. రాష్ట్రం దివాలా తీసిందని చెప్తూనే ముఖ్యమంత్రికి కొత్త క్యాంపు కార్యాలయం ఎందుకు కడుతున్నారని కేటీఆర్ ప్రశ్నించారు. ఇప్పటికే ఉన్న క్యాంపు కార్యాలయాన్ని పక్కనపెట్టి కొత్త కార్యాలయం కట్టడం ఎందుకో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. భేషజాల వల్లనే రేవంత్‌రెడ్డి ప్రగతిభవన్‌ను వాడ లేదని, సీఎం మారినప్పుడల్లా కొత్తవి కట్టుకుంటూ పోతే ఎలా? అని ప్రశ్నించారు. అవసరం లేని భవనాలు కట్టడానికి రేవంత్‌రెడ్డికి డబ్బులు వస్తున్నాయి కానీ రైతుబంధు ఇవ్వటానికి రావట్లేదని విమర్శించారు.

### త్వరలో సోషల్‌మీడియా బలగంతో భేటీ

పార్లమెంట్ స్థానాలవారీగా సన్నాహక సమావేశాలను విజయవంతంగా పూర్తి చేశామని కేటీఆర్ తెలిపారు. రోజూ 10 అసెంబ్లీ నియోజకవర్గాల చొప్పున పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాలను నిర్వహించామని చెప్పారు. త్వరలోనే 30 వేల మంది సోషల్ మీడియా కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో 14 స్థానాల్లో స్వల్ప ఓట్ల తేడాతో కోల్పోయినట్టు వివరించారు. పార్లమెంట్ సన్నాహక సమావేశాల్లో క్షేత్రస్థాయి కార్యకర్తల నుంచి మంచి ఫీడ్‌బ్యాక్ వచ్చిందని తెలిపారు. గతంలో జరిగిన కార్యక్రమాలపై కూడా విమర్శనాత్మక ఫీడ్‌బ్యాక్ ఇచ్చారని, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి కూడా క్షేత్రస్థాయి నుంచి ఫీడ్‌బ్యాక్ వచ్చిందని వెల్లడించారు.

### వద్దన్న సలహాదారులే ముద్దా?

ఒకప్పుడు ప్రభుత్వ సలహాదారులు వద్దని చెప్పిన రేవంత్‌రెడ్డి, కోర్టులో కేసు కూడా వేశారని, ఇప్పుడు ఆయనే రాజకీయ నిరుద్యోగులను సలహాదారులుగా నియమించుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వాన్ని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారని ఆరోపించారు. సీఎం దావోస్ పర్యటనపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విమర్శలు గుప్పించారని తెలిపారు. అంతర్జాతీయ సంస్థలతో సామాజిక న్యాయం, సమానత్వం, ఉద్యోగ, ఉపాధి కల్పన వంటివి భూతద్దం పెట్టి వెతికినా కనిపించవని భట్టి ఒకవైపు మాట్లాడుతుంటే.. సీఎం మాత్రం అదే అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారని ఎద్దేవా చేశారు. సీఎం గురించి కాకుంటే డిప్యూటీ సీఎం భట్టి ఎవరి గురించి మాట్లాడారో చెప్పాలని డిమాండ్ చేశారు. భట్టి మాటలు వింటుంటే రేవంత్‌రెడ్డి దావోస్ ఎందుకు పోయిండో చెప్పాలని ప్రశ్నించినట్టుగా ఉన్నదని అన్నారు. గతంలో తాను దావోస్ వెళ్లినప్పుడు స్విస్ బ్యాంకులో డబ్బులు దాచుకున్నారని విమర్శించిన ఉత్తమ్ కుమార్‌రెడ్డి లాంటివాళ్లు ఇప్పుడు మాట్లాడాలని డిమాండ్ చేశారు.

### స్వల్ప కాలంలోనే ప్రభుత్వంపై వ్యతిరేకత

కొత్త ప్రభుత్వంపై స్వల్పకాలంలోనే అన్ని వర్గాల నుంచి విపరీతమైన వ్యతిరేకత వచ్చిందని కేటీఆర్ తెలిపారు. కొత్త ప్రభుత్వానికి సమయం ఇవ్వాలని చెప్పేవాళ్లకు.. ప్రతిపక్షాలు చెప్పే మాటలు కూడా వినే సహనం ఉండాలని చురకలంటించారు. ఈ రోజుకు కూడా రెండు ఎకరాలకు మించి రైతుబంధు పడడం లేదని తెలిపారు. ఆత్మహత్య చేసుకున్న 9 మంది ఆటో డ్రైవర్లను బీఆర్ఎస్ పార్టీ తరఫున ఆదుకుంటామని కేటీఆర్ భరోసా ఇచ్చారు. రాష్ట్రంలోని లక్షల మంది ఆటో డ్రైవర్ల సమస్యలపై పోరాటం చేస్తామని ప్రకటించారు.

### జట్టుకట్టిన జాతీయ పార్టీలు

రెండు జాతీయ పార్టీలు కేసీఆర్‌పై కుట్ర పన్నేందుకు జట్టుకట్టాయని కేటీఆర్ ఆరోపించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లోనూ ఈ రెండు పార్టీలు కుమ్మక్కై బీఆర్ఎస్‌తో కొట్లాడుతాయని అన్నారు. బండి సంజయ్ వ్యాఖ్యలు, అదానీతో రేవంత్‌రెడ్డి ఒప్పందాలు అందులో భాగమేనని విమర్శించారు. హామీల అమలు నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు రేవంత్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు. రాష్ట్రంలోని బెల్టు షాపులను ఎత్తేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు ఎలైట్ బార్లు పెడుతామంటున్నదని ఎద్దేవా చేశారు.

కాళేశ్వరంతో ఒక్క ఎకరానికి నీళ్లు రాలేదంటూనే.. లక్ష ఎకరాలకు నీళ్లిచ్చామని మంత్రి కొండా సురేఖ చెప్పారని అన్నారు. ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తారో ఇవ్వరో చెప్పాలని నిలదీశారు. ఎన్నికల కోడ్ అమలులోకి రాకముందే గ్యారెంటీల అమలుకు జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల్లోని 13 హామీల అమలుపై వెంటనే జీవోలు ఇవ్వాలని అన్నారు. రాష్ట్రంలో కోటి 57 లక్షల మంది మహిళలు రూ.2,500 ఆర్థిక సహాయం కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు.

### లోక్‌సభ ఎన్నికలకు సిద్ధం

లోక్‌సభ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కొట్లాడేందుకు తాము సిద్ధంగా ఉన్నామని కేటీఆర్ తెలిపారు. పార్టీ అధ్యక్షుడు కేటీఆర్ అధ్యక్షతన శుక్రవారం పార్లమెంటరీ పార్టీ సమావేశమవుతున్నదని, శనివారం పార్టీ మైనార్టీ విభాగం సమావేశం ఉంటుందని చెప్పారు. శనివారం నుంచి అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా పార్లమెంట్ ఎన్నికల సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. బండి సంజయ్ కరీంనగర్‌కు చేసిన పనులేంటో చెప్పాలని, ఆయన చెప్పిన అంశాలపై బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్‌కుమార్‌తో కరీంనగర్‌లో ఎక్కడ చర్చకు వస్తారో చెప్పాలని సవాల్ విసిరారు.



#### వద్దన్న అదానీతో ఒప్పందాలు

**పది** సంవత్సరాలపాటు అదానీని తాము తెలంగాణకు రానీయలేదని, అదానీ పెట్టుబడులు మోదీకే లాభమని చెప్పిన కాంగ్రెస్ పార్టీ, నేడు అదే అదానీతో ఒప్పందం ఎలా చేసుకున్నదని కేటీఆర్ ప్రశ్నించారు. అదానీని ఒకవైపు రాహుల్‌గాంధీ తిడుతుంటే, ఇక్కడ రేవంత్‌రెడ్డి మాత్రం ఆయనతో ఒప్పందం చేసుకుంటున్నారని ఎద్దేవాచేశారు. ఒకే ముఖ్యమంత్రిని ఐదేండ్లపాటు కొనసాగించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి లేదని కేటీఆర్ అన్నారు. 'ఒకాయన నేనే నంబర్ 2 అంటాడు. డిప్యూటీ సీఎం భార్య మాత్రం మిగతా లీడర్లను పారాచూట్ లీడర్లు అని ఎగతాళి చేస్తుంటారు. ఇంకొకాయన నా మాటే చెల్లుతుందని చెప్తారు. ఇట్లా అనేక వైరుధ్యాల మధ్య ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగుతున్నది. కాంగ్రెస్ పార్టీ లీడర్లు ఎన్నిరకాలుగా దృష్టి మరల్చే ప్రయత్నాలు చేసినా.. ఆ పార్టీ ఇచ్చిన 420 హామీల అమలను చేసేలా మేము, మా పార్టీ శ్రేణులు వెంటాడుతూనే ఉంటాయి' అని స్పష్టంచేశారు.

#### కృష్ణా బేసిన్ ప్రయోజనాలు కేంద్రానికి తాకట్టు

తెలంగాణ ప్రయోజనాలను శాశ్వతంగా కేంద్రానికి తాకట్టు పెట్టేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిందని కేటీఆర్ దుయ్యబట్టారు. ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించే వ్యవహారంపై శాసనసభలో చర్చించాల్సిందని, అఖిలపక్షాన్ని వేయాల్సిందని అన్నారు. కొత్తగా వచ్చామని చెప్తున్న ప్రభుత్వం, ఇంతలోనే అడ్డగోలుగా ఎందుకు నిర్ణయాలు తీసుకుంటున్నదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఫార్మాసిటీ రద్దు, ఎయిర్‌పోర్ట్ మెట్రో రద్దుపై కనీసం క్యాబినెట్ సమావేశంలో కూడా చర్చించినట్టు లేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన ఇంతటి కీలక అంశాలపై ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. తమకు ప్రజలిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని.. తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తునకలా మార్చి కాంగ్రెస్ పార్టీకి అప్పగించామని కేటీఆర్ తెలిపారు.

# వికారాబాద్ అడవులపై రాడార్ పిడుగు

రెండో పేజీ తరువాయి...

వన్యమృగాల మనుగడ కూడా కష్టమే. రోడ్డుపై వాహనాల రాకపోకలతో ఏర్పడే శబ్ద కాలుష్యం మరో సమస్యగా మారే ప్రమాదం ఉన్నది. వీటన్నింటికన్నా అతిపెద్ద సమస్య రేడియేషన్. వీఎల్ఎఫ్ కేంద్రాన్ని ఏర్పాటుచేయడం వల్ల రేడియేషన్ బాగా పెరుగుతుందని, దీనివల్ల చుట్టూ కనీసం 30 కిలోమీటర్లు.. గరిష్ఠంగా 60 కిలోమీటర్ల పరిధిలో నివసించేవారి ఉనికికే ప్రమాదం ఏర్పడుతుందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికాలో ప్రజలు వ్యతిరేకించటంతో వీఎల్ఎఫ్ టెక్నాలజీ కేంద్రాన్నే తీసివేశారని గుర్తు చేస్తున్నారు. మనదేశంలో కూడా ఇతర రాష్ట్రాలేవీ వీఎల్ఎఫ్ కేంద్రం ఏర్పాటుకు అనుమతివ్వలేదని చెప్తున్నారు. భూ పరివేష్టిత ప్రాంతంలో వీఎల్ఎఫ్ కేంద్రం ఏర్పాటు చేయడాన్ని కూడా పర్యావరణవేత్తలు తప్పుపడుతున్నారు. దామగుండం పరిరక్షణ వేదిక పేరుతో స్థానికులు న్యాయస్థానాలను ఆశ్రయించారు. రాడార్ కేంద్ర ఏర్పాటు ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. న్యాయస్థానాల్లో వీరి ప్రయత్నాలు పూర్తికాకముందే కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం 2,900 ఎకరాల అటవీ భూమిని నౌకాదళ అధికారులకు అప్పగించింది. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నౌకాదళ అధికారులకు భూ పత్రాలను అందజేశారు.

### 12,12,753 చెట్ల నరికివేత

పచ్చదనానికి తెలంగాణ పర్యాయపదంగా మారిందని గణాంకాలు చెప్తున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని చేపట్టి రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది మొక్కలు నాటింది. పర్యావరణ సమతుల్యత, అడవులను కాపాడేందుకు కేసీఆర్ సర్కారు అత్యధిక ప్రాధాన్యమిచ్చింది. గత పదేండ్లలో తెలంగాణ రాష్ట్రం పచ్చదనం పెంపులో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందనేది వాస్తవం. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలే ఈ విషయాన్ని స్పష్టం చేశాయి. ఇప్పుడు రాడార్ కేంద్రం ఏర్పాటుతో అక్షరాలా 12 లక్షల 12 వేల 753 వృక్షాలను నరకాల్సి వస్తున్నది. ఇవి ఆషామాషీ చెట్లు కావు. ప్రకృతి సిద్ధంగా వందల సంవత్సరాలుగా ఏర్పడ్డ చెట్లు ఇవి. వీటిని ఇప్పుడు నాటడమన్నది సాధ్యం కాకపోవచ్చు. ఒకవేళ నాటినప్పటికీ ఇవి పెరిగి పెద్దవి అయ్యేందుకు వందల సంవత్సరాలు పడుతుంది. ఇవి ఇచ్చే పండ్లు, మంచిగాలికి వెలకట్టలేం. హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి పర్యాటకులు వికారాబాద్ ప్రాంతానికి విహార యాత్రకు వస్తుంటారు. ఇక్కడి దట్టమైన అడవి, ఆ అడవి నుంచి వచ్చే స్వచ్ఛమైన గాలికి తిరుగులేదు. 'వికారాబాద్ కా హవా.. లాకో మరీజోకా దవా' అనే నానుడి ఉన్నది. అంటే వికారాబాద్ ప్రాంతంలోని అడవుల నుంచి వచ్చే స్వచ్ఛమైన గాలి లక్షలాది రోగాలకు మందులా పనిచేస్తుందని చెప్తుంటారు. నిజాం నిజాంనవాబు హైదరాబాద్‌ను పాలిస్తున్న సమయంలో అనంతగిరి అడవుల్లో ప్రత్యేకంగా రోగుల కోసమే ఒక వైద్యశాలను ఏర్పాటు చేసినట్టు చరిత్రకారులు సైతం చెప్తుంటారు. టీబీ, ఛాతి వ్యాధులున్నవారు ఇక్కడికి వస్తే రోగాలు నయం అవుతాయని శాస్త్రీయంగా కూడా రుజువయ్యింది. ఇక్కడి అటవీ ప్రాంతంలో ఔషధ మొక్కలు విరివిగా లభిస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం, వివిధ సంస్థలు కూడా ఔషధ మొక్కల నర్సరీలను కూడా ఏర్పాటు చేశాయి. దేశంలోని అనేక ప్రాంతాలకు ఇక్కడి ఔషధ మొక్కలను రవాణా చేస్తుంటారు. నౌకాదళం రాష్ట్ర ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందంలో తాము కొట్టివేసే చెట్లకు ప్రత్యామ్నాయంగా 12 లక్షల మొక్కలు నాటుతామని హామీ ఇచ్చింది. ఒకవేళ వీళ్లు కొత్తగా నాటినా వాటిని వికారాబాద్‌లోనే పెట్టే అవకాశం లేదు. మన చట్టాల్లో ఉన్న వెసులుబాటును ఉపయోగించుకొని ఎక్కడైనా మొక్కలు నాటవచ్చు.



వికారాబాద్ జిల్లా పూడూరు గ్రామానికి ఆనుకొని ఉన్న దామగుండం భూములను రాడార్ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం కేటాయించడాన్ని నిరసిస్తూ ఆందోళన చేస్తున్న ప్రజలు

### ప్రమాదంలో 175 పక్షిజాతులు

వికారాబాద్ అటవీ ప్రాంతంలోని దామగుండం పరిసరాల్లో అరుదైన వన్యప్రాణులు అనేకం ఉన్నాయి. ఒక అంచనా ప్రకారం 175 రకాల పక్షిజాతులు ఇక్కడ జీవం పోసుకుంటున్నాయి. రాష్ట్ర రాజధానికి అతి దగ్గరగా ఉన్న ఈ ప్రాంతానికి అనేక మంది పక్షి ప్రేమికులు వస్తుంటారు. దుప్పులు, జింకలు, కుందేళ్లు, అడవి పందులు.. ఇలా అనేక రకాల జంతుజాలం కూడా ఇక్కడ ఉన్నది. రాడార్ కేంద్రాన్ని నిర్మిస్తే ఇవన్నీ అంతరించిపోతాయి. దీనిపై స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది.

### 2008 నుంచి ప్రతిపాదన.. కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిదే తొలి సంతకం

ఇక్కడ రాడార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని 2008 నుంచి ప్రతిపాదనలున్నాయి. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వమే తొలిసారి ఇక్కడ రాడార్ కేంద్రం ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సిద్ధంచేసింది. అయితే, పలు రాజకీయ పరిణామాలతో ఇది పక్కకు వెళ్లింది. 2014లో పరిగి ఎమ్మెల్యేగా గెలుపొందిన రామ్మోహన్‌రెడ్డి తొలిసారి అధికారికంగా ఇక్కడి దామగుండం పరిసర ప్రాంతాల ప్రజలతో రాడార్ కేంద్రం గురించి చర్చించారు. దామగుండం ప్రాంతం పూడూరు గ్రామపంచాయతీ పరిధిలో ఉంటుంది. దీంతో ఆ గ్రామ పంచాయతీ తీర్మానం ఇవ్వాలని స్థానిక సర్పంచ్, వార్డు సభ్యులను కోరారు. అక్కడ కేంద్రప్రభుత్వ సంస్థ ఏర్పాటవుతుందని, దాని వల్ల ఈ ప్రాంత ప్రజలకు బీహెచ్ఈఎల్ తరహాలో ఉండే ఒక టౌన్‌షిప్ వస్తుందని, విద్యా సంస్థలు, దవాఖానలు, రోడ్లు, లైట్లు.. ఇలా అన్నీ అందుబాటులోకి వస్తాయని నమ్మబలికారు. రాడార్ కేంద్రం గురించి అవగాహన లేకపోవడంతో గ్రామపంచాయతీలో తీర్మాన పత్రంపై సంతకాలు చేశారు. ఆ రోజు సాయంత్రం 5 గంటలకు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి స్వయంగా పత్రాలు తీసుకొచ్చి సంతకం చేయమంటే చేశామని అప్పటి వార్డు సభ్యులు చెప్తున్నారు. సంతకాలు పూర్తికావడంతో ఎమ్మెల్యే మిగిలిన క్రతువును ముందుకు నడిపించారు. 2017 వరకు అంతర్గత పనులన్నీ పూర్తయి రక్షణ శాఖ అధికారులు ఇక్కడికి రావడంతో విషయం బయటకు వచ్చింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇదే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపింది. ప్రత్యామ్నాయ భూములు కూడా ఇస్తామని చెప్పింది. జాతీయ భద్రత కారణాలను కూడా చెప్పింది. అయితే, నాటి కేసీఆర్ సర్కారు ఈ అంశాన్ని నాన్చుతూ వచ్చింది. పూర్తిస్థాయి సమ్మతిని తెలుపలేదు. కేంద్రం నుంచి అనేక సార్లు ఒత్తిడి వచ్చినా పట్టించుకోలేదు. 2018లో జరిగిన ఎన్నికల్లో రామ్మోహన్‌రెడ్డి ఓడిపోయి మహేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యే అయ్యారు. 2018 నుంచి 2023 డిసెంబర్ వరకు దామగుండంలో రాడార్ కేంద్ర ఏర్పాటుకు సంబంధించిన పనులేమీ జరగలేదు. తాజా ఎన్నికల్లో పరిగి నుంచి మళ్లీ మహేశ్వర్‌రెడ్డి గెలుపొందారు. ఆయన గెలిచిన పక్షం రోజుల్లోనే కేంద్ర ప్రభుత్వ అధికారులు రంగంలోకి దిగారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు కూడా సహకరించారు. పది రోజుల్లోనే ఒప్పంద పత్రాలపై సంతకాలు పూర్తిచేసి భూమి అప్పగింత కార్యక్రమాన్ని పూర్తిచేశారు. దీంతో స్థానిక ప్రజలు బిత్తరపోయారు.

#### మూసీకి నీళ్లు ఎలా?

**మూసీ** నది జన్మస్థానం వికారాబాద్ అడవులు. మూసీ నది జన్మస్థానం వద్ద ఉండే అనంతగిరి వద్ద రెండువైపులా అడవులుంటాయి. ఒకవైపు దామగుండం, మరోవైపు అనంతగిరి అడవులుంటాయి. మూసీనదికి ఏర్పడే నీటి ఊటలు దామగుండంలో కూడా ఉన్నాయి. ఇక్కడ వేసవి కాలంలో కూడా నీటి ప్రవాహాలు కనిపిస్తుంటాయి. ఇక్కడి నీటి ఊటలు, చిన్న చిన్న పాయల సమూహమే మూసీగా రూపాంతరం చెందుతుంది. అలాంటిది ఇప్పుడు ఇక్కడి చెట్లను నరికివేసి రాడార్ కేంద్రాన్ని ఏర్పాటుచేస్తే నీటి ఊటలు మాయమవుతాయి. మూసీకి నీళ్లు రావడం కూడా కష్టమే అవుతుందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.



వికారాబాద్ జిల్లాలో రాడార్ కేంద్రం ఏర్పాటుచేయనున్న ప్రాంతం

#### వీఎల్ఎఫ్ కేంద్రంలో ఏం చేస్తారు?

***సముద్రంలో,*** *సముద్రగర్భంలో ఉండే భారత రక్షణ నౌకలు, జలాంతర్గాములను పర్యవేక్షించటానికి ఈ కేంద్రానికి ఏర్పాటుచేస్తున్నారు. వెరీ లో ఫ్రీక్వెన్సీ రాడార్ సిస్టం దీని కోసం ఉపయోగిస్తారు. తరంగాలను ఉపయోగించి సముద్రంలో రాకపోకలు సాగించే నౌకల గమనాన్ని పరిశీలిస్తారు. ఈ రాడార్ కేంద్రాన్ని ఇక్కడే ఏర్పాటు చేయాలనేమీ లేదు. గతంలో ఇదే తరహా కేంద్రాన్ని కేరళలో పెట్టే ప్రయత్నం చేశారు. అక్కడి ప్రజలు వ్యతిరేకించడంతో ఆ ప్రతిపాదన విరమించుకున్నారని పర్యావరణవేత్తలు చెప్తున్నారు. తరంగాలను పంపడమంటే రేడియేషన్ ప్రభావం కచ్చితంగా ఉంటుందని నిపుణులు అంటున్నారు. దీనిపై స్థానిక ప్రజల్లో అవగాహన కల్పించలేదు. దీంతో ప్రజల్లో గందరగోళం నెలకొన్నది. ఎంత రేడియేషన్ ఉంటుంది? రేడియేషన్ ప్రభావం తగ్గేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేస్తారన్నది నౌకాదళ అధికారులు కానీ, స్థానిక ఎమ్మెల్యేగానీ ప్రజలకు వివరించి చెప్పలేదు. జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు కూడా దీనిపై దృష్టి పెట్టలేదు. చుట్టుపక్కల గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ, ఇప్పటివరకు అలాంటి ప్రయత్నమే చేయలేదు. దామగుండం గ్రామం ఉన్న పూడూరు పంచాయతీ తీర్మానాన్ని మాత్రమే తీసుకున్నారు. చుట్టుపక్కల కనీసం 25 గ్రామాలున్నాయి. ఆ గ్రామాలవారికి రాడార్ కేంద్రంపై కనీస అవగాహన లేదు. తమ గ్రామాల్లో గ్రామసభలు పెట్టకుండా ఎలా అడవులను అప్పగిస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.*

#### 30 వేల మందికి ప్రత్యక్ష నరకం

**దామగుండంలో** రాడార్ కేంద్రం ఏర్పాటు సరికాదు. దీన్నివల్ల రేడియేషన్ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. మేం దీన్ని వ్యతిరేకిస్తున్నాం. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో చెప్పాం. ఆయన తాను కారణం కాదన్నట్టుగా మాట్లాడుతున్నారు. ఆయన ప్రోద్బలంతోనే ఇక్కడ వీఎల్ఎఫ్ రాడార్ కేంద్రం ఏర్పాటవుతున్నది. దీనివల్ల చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లోని 30 వేల మంది ప్రజలకు ప్రత్యక్షంగా ఇబ్బంది తప్పదు. రామ్మోహన్‌రెడ్డి 2014లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక పూడూరు గ్రామానికి వచ్చి పంచాయతీ తీర్మానం తీసుకెళ్లారు. మళ్లీ ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే నేవీ అధికారులను వెంటపెట్టుకెళ్లి సీఎంతో రెండుసార్లు మీటింగ్ పెట్టించి భూములు బదిలీ చేయించారు.

**–మల్లేశ్ పటేల్, సినిమా సెన్సార్‌బోర్డ్ సభ్యుడు, బీజేపీ నేత**

#### ఉద్యోగాలిస్తామన్నది బూటకం

**రాడార్** కేంద్రం వస్తే స్థానికులకు ఉద్యోగాలు ఇస్తారని ప్రచారం చేస్తున్నారు. ఇది శుద్ధ అబద్ధం. ఉత్త బూటకపు మాట. రాడార్ కేంద్రంలో పనిచేసేదే కొద్ది మంది. దాంట్లో కూడా సాంకేతిక నిపుణులే ఉంటారు. మా గ్రామంలోని యువతకు ఉద్యోగాలు ఎలా ఇస్తారు? దేశంలో ఎక్కడ కూడా నేవీ కేంద్రాల్లో పనిచేసేవారికి స్థానిక రిజర్వేషన్లు ఇవ్వలేదు. ఇక్కడ ఎందుకు ఇస్తారు? మా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం జరుగుతున్నది. మాకు ఉద్యోగాలు రావుకానీ.. కొంతమంది నాయకులకు కాంట్రాక్టులు వస్తాయి. పైసలు వస్తాయి. అందుకే వాళ్లు గ్రామ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

**- వెంకటయ్య, దేవునోని గూడెం**

#### మా ఔషధ మొక్కలు.. మా అడవి మాక్కావాలి

**రాడార్** కేంద్రంతో మా అడవిలో దొరికే ఔషధాలు సర్వ నాశనమవుతాయి. ఔషధ మొక్కలను ఎక్కడి నుంచి తెచ్చి ఇస్తారు? మా ప్రకృతిని ఎక్కడి నుంచి తెచ్చి ఇస్తారు? ప్రజలకు హాని తలపెట్టే ఇలాంటి ప్రాజెక్టులను అడ్డుకొని తీరుతాం. ఒకవేళ రాడార్ కేంద్రమే మా అడవిలోకి వస్తే ఇక్కడ పిట్టలు కూడా గుడ్లు పెట్టవు. రాడార్ కేంద్రం వల్ల వచ్చే రేడియేషన్‌తో అనేక అనర్థాలు జరుగుతాయి. మా యువకులు, మా వృద్ధులు, మా పిల్లల భవిష్యత్తు గురించి ఎవ్వరూ మాట్లాడటం లేదు. మా ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి ఈ ప్రాజెక్టుపై ఎందుకంత ఆసక్తో చెప్పాలి.

**- జంగయ్య, గ్రామ వార్డుసభ్యులు**

#### ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత లేదా?

**ఇంత** పెద్ద కేంద్రాన్ని తీసుకొస్తున్నపుడు స్థానిక ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై లేదా? పర్యావరణవేత్తలను, నిపుణులను తీసుకొచ్చి మాకు అవగాహన కల్పించాల్సింది. ఎలాంటి అవగాహన కల్పించకుండా గ్రామ పెద్దలతో సంతకాలు చేయించుకున్నారు. గ్రామసభలను కూడా నిర్వహించలేదు. అంతా తూతూ మంత్రంగానే చేశారు.

**-బస్వ శ్రీనివాస్‌గౌడ్**

#### మమ్మల్ని ఏమార్చారు

**మమ్మల్ని** ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఏమార్చారు. ఈసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత కూడా పూడూరు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే ప్రజాపాలనలో పాల్గొన్నారు. రాడార్ స్టేషన్ తెచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని చెప్పాడు. తాను రాడార్ స్టేషన్ ఏర్పాటుకు వ్యతిరేకమన్నాడు. కానీ, మా గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్న తర్వాతి రోజే నేవీ అధికారులను తీసుకొని సీఎంను కలిశాడు. భూ బదిలీ కార్యక్రమాన్ని కూడా దగ్గరుండి చేయించాడు. ఆయన మమ్మల్ని మోసం చేశారనడానికి ఇంతకన్నా నిదర్శనం ఏం కావాలి?

**- టీ రాజేందర్, ఉపసర్పంచ్**

#### సంతకం పెడితే 10 వేలు ఇస్తామన్నారు

**మాకు** రాడార్ సెంటర్ గురించే తెలియదు. ఒక రోజు సాయంత్రం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి వచ్చి రాడార్ కేంద్రం వస్తుందని, మన ఊర్లో పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి, పంచాయతీ తీర్మానం కావాలన్నాడు. నేనే ఫస్ట్ సంతకం పెట్టిన.. మీరు కూడా పెట్టండి అని చెప్పిండు. పంచాయతీ తీర్మానం కావాలనడంతో మేము తీర్మాన పత్రంపై సంతకం చేశాం. సంతకం చేసిన తర్వాత ఎమ్మెల్యే మనుషులు వచ్చి రూ.10 వేలు ఇస్తామన్నారు. ఎందుకు అని అడిగితే తీర్మానంపై సంతకం చేసినవాళ్లు కొంత మంది అడిగిండ్రు అని చెప్పిండ్రు.

**- సుజాత, మాజీ వార్డు సభ్యురాలు**